క్లుప్తంగా

లక్ష్మీదేవికి స్వర్ణ పుష్పార్చన


లలితా పీఠంలో స్వర్ణ పుష్పార్చనలో లక్ష్మీదేవి

సీతంపేట: ఫల్గుణ మాసం పౌర్ణమి సందర్భంగా మహాలక్ష్మి జన్మదినం పురస్కరించుకుని సోమవారం అక్కయ్యపాలెం లలితానగర్ శ్రీలలితా పీఠంలో లక్ష్మీదేవికి 108 స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. ముందుగా అమ్మవారికి విశేష అభిషేకం జరిపారు. పీఠం దర్బారు హాల్లో రాజశ్యామల హోమం నిర్వహించారు. పలువురు భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శివాలయంలో అన్నదానం


అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆలయ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, ఈవో శేఖర్‌బాబు

సీతమ్మధార: పౌర్ణమి సందర్భంగా సోమవారం నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు రామారావు శర్మ, మహేష్ పూజలు చేశారు. ఉదయం స్వామికి పంచామృతాభిషేకం, సుగంధాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, ఈవో పైల శేఖర్‌బాబు, ట్రస్టు సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థాయి


వసతి గృహం విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కంచరపాలెం క్రైం సీఐ శ్రీనివాస్

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్లపై జరుగుతున్న సెల్‌ఫోన్ల దొంగతనాలు, విద్యార్థులకు చదువు, భవిష్యత్తుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కంచరపాలెం గిరిజన బాలుర ఎస్టీ వసతి గృహంలో ఉంటున్న డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ విద్యార్థులకు సోమవారం క్రైం సీఐ శ్రీనివాస్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. సుమారు 150 మంది విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ ఒక లక్ష్యం ఉండాలని, ఆ దిశగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. చెడు సావాసాలు, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏఎస్‌ఐ సీహెచ్ రమణ, కానిస్టేబుల్ తులసి, వార్డెన్ సీతారాం పాల్గొన్నారు.

25 మద్యం బాటిళ్లు స్వాధీనం

సీతమ్మధార: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను ద్వారకా జోన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధి నక్కవానిపాలెం గాంధీనగర్‌లో కాగితాల ఎర్రమ్మ అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సమాచారంతో పోలీసులు తనిఖీలు చేయగా.. 25 క్వాటర్ బాటిళ్ల మద్యం ఉన్నట్టు గుర్తించారు. ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి. 25 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లో గతంలో కాగితాల ఎర్రమ్మపై కేసు ఉంది.

వ్యక్తి అదృశ్యం


వాసు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ధర్మానగర్‌లో నివసిస్తున్న ఇమ్మిడిశెట్టి వాసు గొల్ల కంచరపాలెంలోని అతడి అక్క ఎం.గుణవతి ఇంటికి వెళ్లాడు. తిరిగి ఈ నెల 22న ఇంటికి వెళ్లమని అతడి అక్క ఆటోకు డబ్బులు ఇచ్చి పంపించింది. అప్పటి నుంచి వాసు ఆచూకీ తెలియకపోవడంతో ఆమె ఫిర్యాదు చేశారు. వాసుకు మతిమరపు ఉందని, ఎక్కడికి వెళ్లాడో తెలియలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆపద్బాంధవి

- పేదల వైద్యానికి అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి
- 'ఉత్తర'లో 415 మందికి లబ్ధి
- ప్రభుత్వ సాయంపై లబ్ధిదారుల్లో సంతోషం


బాధిత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న కె.కె.రాజు(ఫైల్)

సీతంపేట: పేదలకు ఆపద్బాంధవిగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఆదుకుంటోంది. ప్రాణాంతక, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆర్థిక సాయం రూపంలో అండగా నిలిచింది. సాంకేతిక కారణాలతో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు పొందలేని పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు చేసింది. వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఆధ్వర్యంలో 2019 నుంచి 2024 వరకు ఉత్తర నియోజకవర్గంలో 415 మంది పేదలకు అవసరమైన వైద్యానికి గంటల వ్యవధిలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిధులు మంజూరు కావడం విశేషం. గత టీడీపీ ప్రభుత్వం కంటే ఎంతో మెరుగ్గా దరఖాస్తు చేసుకున్న 12 గంటల్లోనే అత్యవసర వైద్యానికి, ఆస్పత్రిలో చేరేందుకు అవసరమైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్.ఒ.సి.) పత్రాలను సీఎం క్యాంప్ ఆఫీస్ నుంచి మంజూరు చేసి పేదల వైద్యానికి ప్రాధాన్యం కల్పించారు. 1977 నుంచి సీఎం రిలీఫ్ ఫండ్ విధానం అమలులో ఉన్నా.. నాడు వైఎస్సార్ హయాంలో, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల వైద్యానికి త్వరితగతిన సహాయ నిధి నుంచి పెద్ద ఎత్తున సాయం అందిందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కె.కె.రాజు ప్రత్యేక చొరవతో..

ఉత్తర నియోజకవర్గంలో అత్యవసర వైద్యం కోసం ఎల్‌వోసీలు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సత్వర సాయం పొందేలా వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. వైద్యం చేయించుకున్న తర్వాత రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి త్వరితగతిన చెక్కులు మంజూరు చేసేలా కె.కె.రాజు ప్రత్యేక యంత్రాంగాన్ని తన కార్యాలయంలో ఏర్పాటు చేయడంతో ఆర్థిక సాయం పొందడానికి మార్గం సులభమైంది. ఈ విధంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడిచిన ఐదేళ్లలో 415 మందికి సుమారు రూ.5.70 కోట్ల విలువైన ఎల్‌వోసీలు, సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం అందించి బాధితుల వైద్యానికి అండగా నిలిచారు. వీరిలో గరిష్టంగా ఒక చిన్నారి వైద్యానికి రూ.5.20 లక్షలు. మరో అబ్బాయి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం రూ.5 లక్షలు పెద్ద మొత్తంలో ఎల్‌వోసీ అందించడం విశేషం.

415 మందికి రూ.5.70 కోట్ల సాయం



రాష్ట్రంలో ఏ ఒక్కరూ పేదరికంతోఎవైద్యం చేయించుకోలేని పరిస్థితితో మరణాలు సంభవించకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగంలో పెనుమార్పులు తీసుకొచ్చారు. ఆరోగ్యశ్రీ వర్తించక పోయినా, అత్యవసర వైద్యానికి ఆర్థిక సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంటే 12 గంటల లోపు ఎల్‌వోసీలు ఇస్తున్నాం. ఉత్తర నియోజకవర్గం నుంచి ఐదేళ్లలో 415 మంది వైద్యానికి సుమారు రూ.5.70 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సాయం అందించాం.

– కె.కె.రాజు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఉత్తర నియోజకవర్గం

ప్రభుత్వ సాయం మరువలేను



నాకు నెలలు నిండక ముందే ఏడో నెలలో బాబు పుట్టడంతో వైద్యం అత్యవసరమైంది. షీలా నగర్ కిమ్స్ ఆస్పత్రిలో వైద్యం చేయించాం. సుమారు రూ. 8 లక్షలు ఖర్చయింది. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజును బాబు వైద్యం విషయమై సంప్రదించగా.. ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి బిల్లులో 30 శాతం తగ్గించేలా చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం మాచేత దరఖాస్తు చేయించారు. రూ.1,25,000 సాయం అందింది, ఇపుడు బాబు చాలా ఆరోగ్యంగా ఉన్నాడు. ప్రభుత్వం చేసిన సాయం బాబుతో పాటు ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

– సనపల లావణ్య, మాధవధార

ఆర్థిక సాయంతో ఆదుకున్నారు



నా భర్త ప్రేగులకు జీడీఎస్ ఇన్ఫెక్షన్ వచ్చింది. లక్ష మందిలో ఒకరికి వచ్చే వ్యాధి చికిత్సకు లక్షల్లో ఖర్చవుతుందన్నారు. అంత ఆర్థిక స్థోమత లేక కె.కె.రాజు కార్యాలయాన్ని సంప్రదించాం. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం కోసం మాచేత దరఖాస్తు చేయించారు. చాలా త్వరగా రూ.1.63 లక్షలు ఆర్థిక సాయం లభించింది. ముఖ్యమంత్రి జగన్, కె,కె.రాజులకు రుణపడి ఉంటాము.

– బత్తిన నాగలక్ష్మి, సంతోష్‌నగర్, 46వ వార్డు

వైఎస్సార్‌సీపీకి మద్దతివ్వండి


గౌరీ సేవా సంఘం నాయకులతో బొత్స ఝాన్సీ, కె.కె.రాజు, ఆడారి ఆనంద్‌కుమార్

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలోని గౌరీ సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు బుద్ధ శివాజీ ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతివ్వాలని సంఘ సభ్యులను వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు బాణాల శ్రీనివాస్, పార్టీ నాయకులు పేడాడ రమణికుమారి, పీలా ఉమారాణి, పిల్లా రమాకుమారి, కోలా గురువులు, కార్పొరేటర్లు పి.ఉషశ్రీ, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, ఆళ్ల శివగణేష్, సంఘ నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యం


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతంపేట: గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపునిచ్చారు. 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో శ్రీనివాసనగర్‌లో ఆమె ఇంటి వద్ద సోమవారం పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో రహదారులు, డ్రెయిన్లు, కల్వర్టులు, స్కూల్, పార్కు, బ్రిడ్జి విస్తరణ చేపట్టి శ్రీనివాసనగర్‌కు రోడ్ కనెక్టవిటీ, సామాజిక భవనాలు, దోబీఖానా ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించామని చెప్పారు. ఇదంతా ప్రజలకు చేరువ చేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకులు బాణాల శ్రీనివాసరావు, చొక్కాకుల వెంకటరావు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, రవీంద్రనాథ్ ఠాగూర్, తిరుపతి రావు, పారుపల్లి రవి, బైర వెంకట్, వార్డు నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు, గృహసారథులు పాల్గొన్నారు.

పార్టీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో నందగిరినగర్‌లో ఏర్పాటు చేసిన వార్డు ఎన్నికల కార్యాలయాన్ని కె.కె.రాజు ప్రారంభించి మాట్లాడారు. రానున్న ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజలను, కార్యకర్తలను సమన్వయం చేస్తూ ముందుకు సాగాలని సూచించారు.

నూకాంబికను దర్శించుకున్న కె.కె.రాజు


జలాభిషేకంలో అమ్మవారు


నూకాంబిక పూజల్లో పాల్గొన్న కె.కె.రాజు

కంచరపాలెం: శుద్ధ పౌర్ణమి సందర్భంగా సోమవారం 48వ వార్డు బర్మాక్యాంప్ జైభారత్‌నగర్‌లో కొలువైన నూకాంబిక అమ్మవారి వార్షిక మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు దర్శించుకున్నారు. నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి జలాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచి అమ్మవారికి మొక్కు తీర్చుకుంటానన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, జైభారత్‌నగర్ ప్రజలతో కె.కె.రాజు మాట్లాడారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, పార్టీ సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, జైభారత్‌నగర్ గ్రామాధ్యక్షుడు బొగ్గ శ్రీను, నాయకులు అప్పారావు, శైలేష్, కల్యాణ్, శ్రీను, గంగరాజు, హేమంత్, పద్మా, చిన్న, గణేష్, రమణ, ఈశ్వరరావు, శ్రీరామ్, రవి, జాగరపు అప్పారావు పాల్గొన్నారు.

అమ్మవారికి జలాభిషేకం

మురళీనగర్: బర్మా క్యాంప్ జైభారత్‌నగర్‌లో వెలసిన నూకాంబిక ఆలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొత్త అమావాస్య జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి జలాభిషేకం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 6 గంటలకు మహిళలు భారీ సంఖ్యలో బిందెలతో పవిత్ర జలాలను తీసుకొచ్చి 11 గంటల వరకు శాస్త్రోక్తంగా జలాభిషేకం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. డిప్యూటీ సూపరింటిండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ జి.శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ అనంతరావులు సిబ్బందితో సోమవారం రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాలను తనిఖీచేస్తుండగా బి.పవన్‌కుమార్ బ్యాగులో 3.5 కిలోల గంజాయిని గుర్తించారు. విశాఖ మీదుగా చెన్నైకు గంజాయి తీసుకువెళ్తున్నట్లు విచారణలో అంగీకరించడంతో రిమాండ్ నిమిత్తం కోర్టులో పవన్‌ను హాజరుపరిచినట్టు జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

కె.కె.రాజుకు పాస్టర్ల మద్దతు


కె.కె.రాజును కలిసిన 47వ వార్డు పాస్టర్లు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు 47వ వార్డుకు చెందిన పలువురు చర్చి పాస్టర్లు మద్దతు తెలిపారు. సోమవారం ఉత్తర పార్టీ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో వారంతా కె.కె.రాజును కలిసి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు.

లోకహితుడు మాస్టర్ ఈకే


శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలతో అతిథులు

తాటిచెట్లపాలెం: తన జీవితాన్ని సమాజ శ్రేయస్సు కోసం సమర్పించిన మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య లోకహితుడని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో ఆయన ఆధ్వర్యంలో సోమవారం మాస్టర్ ఈకే 40వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్టర్ ఈకే పుణ్యతిథిని మాస్టర్ ఈకే పూర్ణిమగా ప్రతీ ఏటా నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథి ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కంభంపాటి పార్వతీకుమార్ తనయుడు కె.గురుప్రసాద్ మాట్లాడుతూ జగద్గురు పీఠం, ధనిష్టా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న వృత్తి విద్యా కోర్సుల ద్వారా వందలాది మంది మహిళలు లబ్ధి పొందుతున్నారని, ఇది తమకెంతో సంతృప్తినిస్తోందన్నారు. జగద్గురు పీఠం ఆధ్వర్యంలో ఆరు నెలల పాటు నిర్వహించిన టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందిన 60 మంది మహిళలకు అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మాస్టర్ ఈకే పూర్ణిమ సందర్భంగా 40 మంది పేద పిల్లలకు దుస్తులను అందించారు. కార్యక్రమంలో మాస్టర్ ఈకే మనవడు, హోమియో వైద్యుడు డాక్టర్ ఎక్కిరాల అనంత్, సంస్థ సభ్యులు ఆర్.ఎస్.కృష్ణమూర్తి, గొల్లపూడి రవికుమార్, సంస్థ నిర్వాహక సభ్యురాలు బి.ఉషారాణి, దాట్ల రాధ తదితరులు పాల్గన్నారు.

ఘనంగా అయ్యప్ప జన్మనక్షత్ర వేడుకలు



సీతంపేట: శ్రీబాలమురుగన్ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పార్వతీశ్వరాలయంలో అయ్యప్ప స్వామి జన్మదిన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శివాజీశర్మ, భాస్కరశర్మ వేదమంత్రాల మధ్య అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తికి తెల్లవారుజామున పంచామృత, గంధ, విభూది, పండ్లరస, సుగంధ జలాలతో విశేష అభిషేకం జరిపారు. సాయంత్రం మేళతాళాలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై సీతంపేట వీధుల్లో అంగరంగ వైభవంగా స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. అడుగడుగునా భక్తులు స్వామికి టెంకాయలు కొట్టి, హారతులిచ్చి నీరాజనాలు పలికారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆదరించండి.. మరింత అభివృద్ధి చేస్తా

- వాకర్స్, క్రీడాకారులతో వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు


వాకర్స్‌తో మాట్లాడుతున్న కె.కె.రాజు


పోర్టు స్టేడియంలో క్రీడాకారులకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతంపేట: ఉత్తర నియోజకవర్గంలోని 17 వార్డుల్లో గడిచిన ఐదేళ్లలో అనేక అభివృద్ధి పనులు చేశానని, రానున్న ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుతో కలిసి సోమవారం మార్నింగ్ వాక్ నిర్వహించారు. స్టేడియంలో వాకర్స్, క్రీడాకారులు ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వాకర్స్‌ను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు వాకర్స్‌తో మాట్లాడుతూ నియోజకవర్గంలో సీతమ్మధార నుంచి మాధవధార వరకు గల గిరిప్రదక్షిణ రోడ్డు విస్తరణ, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ విస్తరణ, బ్యూటిఫికేషన్, సత్యం సెంటర్ నుంచి సీతమ్మధార రోడ్డు విస్తరణ పనులు చేపట్టామన్నారు. సీఎస్సార్ నిధులు కింద పోర్టు మంజూరు చేసిన రూ.34.75 కోట్లతో నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో కైలాసపురం రోడ్‌లో ఇనార్బిట్ మాల్ నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయని, దీనివల్ల 15 వేల మందికి ఉపాధి కలుగుతుందన్నారు. ఇక్కడే త్వరలో ఐటీ టవర్ నిర్మిస్తామన్నారు. ఆర్ అండ్ బీ వద్ద నిర్మిస్తున్న ఏఎంసీ మాల్ వల్ల భవిష్యత్‌లో వేలాది మందికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. వాకర్స్, క్రీడాకారులకు ఉత్తరలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో రూపొందించిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొడ్డేటి కాశీ విశ్వనాథ్, ఆనంద్, సింగ్, దేవుడుబాబు మాస్టర్, బులుసు జగదీష్, 14వ వార్డు నాయకులు, కార్యకర్తలు, ఇతర పెద్దలు పాల్గొన్నారు.

అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

సీతంపేట: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తర నియోజకవర్గంలో క్లస్టర్ల వారీగా అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

క్లస్టర్–1 అధ్యక్షులు

మహిళా విభాగం ప్రెసిడెంట్ డి.రమా స్వరూప రాణి, బీసీ సెల్–పొన్నాడ శ్రీనివాసరావు, ఎస్సీ సెల్–అలమండ శంకర్, ఎస్టీ సెల్–ఆసనాల రాజు, మైనార్టీ సెల్–ఎం.డి.ఆసిఫ్ బాషా, స్టూడెంట్ వింగ్–ఎన్నింటి దేవిక, వీవర్స్ వింగ్–బేతా కనకరాజు, వైఎస్సార్‌టీయూసీ వింగ్–జి.రామ్మూర్తి, వైఎస్సార్ సేవాదల్–ఆర్.శంకరరావు, పబ్లిసిటీ వింగ్–పి.వాసు, వాణిజ్య విభాగం–వర్మ, క్రిస్టియన్ మైనార్టీ సెల్–గిడుతూరు నిర్మల.

క్లస్టర్–2 అధ్యక్షులు

మహిళా విభాగం ప్రెసిడెంట్ కనకమహాలక్ష్మి, బీసీ సెల్–సింహాద్రినాయుడు, ఎస్సీ సెల్–నేతల కుమార్, మైనార్టీ సెల్–ఎం.డి.బషీర్, స్టూడెంట్ వింగ్–కోలా శ్రీను, వీవర్స్ వింగ్–ఐ.శ్రీనివాస్, వైఎస్సార్‌టీయూసీ వింగ్–పద్మశేఖర్, వైఎస్సార్ సేవాదల్–ఇజ్జా సీతారాములు, పబ్లిసిటీ వింగ్–ఈశ్వరరావు, వాణిజ్య విభాగం–పలసు సాయిమోహన్‌రావు, క్రిస్టియన్ మైనార్టీ సెల్–నెట్టి పద్మ.

క్లస్టర్–3 అధ్యక్షులు

మహిళా విభాగం ప్రెసిడెంట్ కె.లావణ్య, బీసీ సెల్–కాయల నరసింగరావు, ఎస్సీ సెల్–డి.లక్ష్మణరావు, ఎస్టీ సెల్–నల్లబోతులు సావులు, మైనార్టీ సెల్–ఎం.డి,.గౌస్, స్టూడెంట్ వింగ్–అడపాక నానిబాబు, వీవర్స్ వింగ్–పి.ఈశ్వరి, వైఎస్సార్‌టీయూసీ వింగ్–కె.గురువోజీ, వైఎస్సార్ సేవాదల్–బంగారు సురేష్, పబ్లిసిటీ వింగ్–కె.సాగర్, వాణిజ్య విభాగం–వి.దివాకర్ రెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ సెల్–సొండి సురేష్.

క్లస్టర్–4 అధ్యక్షులు

మహిళా విభాగం–బి.సరస్వతి/కమలాకుమారి, బీసీ సెల్–కనమటి రఘు, ఎస్సీ సెల్–గంటా రామకృష్ణ, మైనార్టీ సెల్–షేక్ నూర్ అహ్మద్, స్టూడెంట్ వింగ్–పల్లా చైతన్య, వీవర్స్ వింగ్–గెడ్డం నారాయణరావు, వైఎస్సార్ టీయూసీ వింగ్–పాలిశెట్టి అప్పారావు, వైఎస్సార్ సేవాదల్–లావేటి శ్రీరాములు, పబ్లిసిటీ వింగ్–సనపల లక్ష్మీకాంత్, వాణిజ్య విభాగం–బయ్యా భాస్కర్, క్రిస్టియన్ మైనార్టీ సెల్–కొండపల్లి చిట్టితల్లి.

క్లస్టర్–5 అధ్యక్షులు

మహిళా విభాగం–యల్లబిల్లి వరలక్ష్మి, బీసీ సెల్–బుడుమూరి తిరుమలరావు, ఎస్సీ సెల్–బసవ దిలీప్ చైతన్య, ఎస్టీ సెల్–పెట్ల గౌరి, మైనార్టీ సెల్–అన్సర్ అలీ, స్టూడెంట్ వింగ్–రెయ్యి గణేష్, వీవర్స్ వింగ్–పల్లా సోమేశ్వరరావు, వైఎస్సార్ టీయూసీ వింగ్–షేక్ నబీ, వైఎస్సార్ సేవాదల్–బాదిరెడ్డి మోహనరావు, పబ్లిసిటీ వింగ్–కె.రమేష్ వాణిజ్య విభాగం–ఏదుల రామారావు, క్రిస్టియన్ మైనార్టీ సెల్–బొమ్మాల శరత్‌కుమార్.

ముస్లింల ఆప్యాయత మరువలేనిది


ఇఫ్తార్ విందులో ముస్లింలతో కె.కె.రాజు

కంచరపాలెం: ముస్లింల ఆప్యాయత మరువలేనిదని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 46వ వార్డు కైలాసపురం శాంతినగర్ మసీదు వద్ద స్థానిక ముస్లింలకు సోమవారం సాయంత్రం ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని ముస్లింలతో ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ముస్లింలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వీకేపీపీపీఏఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, నాయకులు ఆళ్ల శివగణేష్, కేవీ బాబా, కాయిత పైడి రత్నాకర్ యాదవ్, షేక్ బాబ్జి, సిరాజుద్దీన్, షబీర్, వార్డు నాయకులు, మహిళలు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

యాసిడ్ తాగిన మహిళ మృతి

సీతమ్మధార: ఆరోగ్యం బాగోలేదని మనస్తాపంతో యాసిడ్ తాగిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఫోర్త్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం రామచంద్రనగర్‌కు చెందిన లక్ష్మి(51) తన పెద్ద కుమార్తె స్వాతి ఇంట్లో ఉంటుంది. లక్ష్మికి అనారోగ్యం కావడంతో కుమార్తె ఆమెను స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించింది. నయం కావడంతో తిరిగి ఇంటి తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో లక్ష్మి కిరాణా షాప్‌నకు వెళ్లి యాసిడ్ బాటిల్ కొని తాగేసింది. కుటుంబ సభ్యులు సమాచారం తెలుసుకుని వెంటనే కేజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం ఆమె మృతి చెందింది. కుమార్తె ఫిర్యాదు మేరకు ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ రాంబట్ల శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.

జాలీగా హోలీ



రామాటాకీస్ రోడ్డులో యువత సందడి


ఆక్సిజన్ టవర్స్‌లో కేరింతలు కొడుతూ రెయిన్ డ్యాన్స్ చేస్తున్న యువత


గాంధీనగర్‌లో హోలీ సంబరాల్లో యువకులు

సీతంపేట: రంగుల వేడుక హోలీ పండగను యువత, చిన్నారులు ఉత్సాహంగా జరుపుకున్నారు. కేరింతలు కొడుతూ రంగుల్లో తడిసి ముద్దయ్యారు. సోమవారం తెల్లవారు నుంచే రంగులు పట్టుకొని రోడ్డెక్కిన యువత బంధువులు, స్నేహితులకు రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు తినిపించుకున్నారు. రామాటాకీస్ గంగానివాస్ వద్ద లేడీస్ సెలూన్ సిబ్బంది హోలీ టీ షర్టులతో ఒకరికొకరు రంగులు పూసుకుంటూ జాలీగా హోలీ జరుపుకున్నారు. మార్వాడీ యువకులు పెద్ద ఎత్తున హోలీ వేడుకల్లో మునిగారు. సీతంపేట, రాజేంద్రనగర్, మధురానగర్, శంకరమఠం, అక్కయ్యపాలెం, ఎన్జీవోస్ కాలనీ, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో యువకులు ఫుల్ జోష్‌గా హోలీ జరుపుకున్నారు.

ఆక్సిజన్ టవర్స్‌లో సంబరాలు అదుర్స్

సీతమ్మధార: సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో హోలీ సంబరాలు ఆకాశాన్నంటాయి. యువతీ, యువకులు, చిన్నారులు, మహిళలు రెయిన్ డ్యాన్స్‌తో దుమ్మురేపారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టవర్స్ ఆవరణలో పిల్లలు, పెద్దలు ఒకరికి ఒకరు రంగులు పూసుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. డీజే సౌండ్స్, రెయిన్ డ్యాన్స్‌లతో యువతీ, యువకులు, కుటుంబ సభ్యులు సందడి చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి ఏటా ఆక్సిజన్ టవర్స్‌లో అందరం కలిసి హోలీ పండగను ఆనందంగా జరుపుకుంటున్నామన్నారు. గాంధీనగర్, నక్కవానిపాలెం, బాలయ్యశాస్త్రి లేఅవుట్, సీతమ్మధార పరిసర ప్రాంతాల్లో యువకులు హోలీ ఘనంగా నిర్వహించారు.

పార్టీ కార్యాలయంలో హోలీ సందడి

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర కార్యాలయంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పాల్గొని పార్టీ శ్రేణులకు రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, శైలేష్, కిరణ్‌రాజు, నీలి రవి పాల్గొన్నారు.


హోలీ వేడుకల్లో కె.కె.రాజు